

'స్థానికం'లో బీసీల హవా!

కులగణన పూర్తయింది. 2014లో జరిగిన సమగ్ర కుటుంబ సర్వేలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 36,46,955మంది జనాభా ఉండగా.. అందులో బీసీలు 14,28,043మంది ఉన్నట్టు గుర్తించారు. నాడు బీసీ జనాభా 40శాతానికి పైగా ఉన్నట్టు లెక్కల్లో తేలగా.. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణనలో ఆ సంఖ్య మరింత పెరిగి.. 45శాతానికిపైగా బీసీ జనాభా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర సర్కారు వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెబుతోంది. అందులో భాగంగానే అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి వేదికగా బీసీలకు ఇచ్చిన స్థానికసంస్థల్లో 42శాతం రిజర్వేషన్ల హామీ అమలుకు సర్కారు కసరత్తు చేస్తోంది. అదే సమయంలో తమకిచ్చిన మాట నిలబెట్టుకోవాలంటూ బీసీ సంఘాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తాచాటిన విషయాలపై విస్తృత చర్చ జరుగుతోంది. నాడు 22శాతమే రిజర్వేషన్ ఉన్నా.. కేటాయించిన స్థానాలతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు జనరల్ స్థానాల్లోనూ వారు పైచేయి సాధించారు. ఇక ఈసారి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే బీసీల ప్రాతినిధ్యం మరింత పెరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గత పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికల్లో వారిదే పైచేయి

- పెరిగిన జనాభాతో ఈ సారి రెట్టింపు కానున్న రిజర్వేషన్ కోటా
- నాడు 22శాతం సీట్లు.. ఇప్పుడు 42శాతం అమలైతే పెరగనున్న ప్రాతినిధ్యం
- పోయిన ఎన్నికల్లో పలు జనరల్ స్థానాల్లో ఉన్నత వర్గాలను ఢీకొట్టి నెగ్గిన వైనం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల్లో సత్తా
- మానుకోటలో జడ్పీటీసీ రిజర్వుకాకున్నా రెండు జనరల్ స్థానాలు కైవసం
- గిరిజనులు అధికంగా ఉన్న మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో బీసీ సీట్లకు కోత

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కుల గణన పూర్తయి.. బీసీ జనాభా లెక్కలు తేలడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ మేరకు రిజర్వేషన్లు ఖరారు చేయాలన్న డిమాండ్ తెరపైకి వస్తోంది. కులగణన నివేదక ప్రకారం రాష్ట్ర జనాభాలో సగానికి పైగా బీసీలున్నారని స్పష్టత రాగా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం 42శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని బీసీ సంఘాల నేతలు ఆందోళనలకు దిగుతున్నారు. ఈ సారి కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నారు. అయితే గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో 22శాతమే రిజర్వేషన్ అమలు చేసినా.. వారిదే హవా కనిపించింది. చాలా జనరల్ స్థానాల్లో బీసీ సామాజిక వర్గ అభ్యర్థులు సత్తా చాటి విజయం సాధించారు. నాటి స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ చైతన్యం ప్రదర్శించిన బీసీలు.. ఉమ్మడి జిల్లాలోని పలు జనరల్ స్థానాల్లో ఉన్నత వర్గాలను ఢీకొట్టి నిలిచారు. పంచాయతీలతో పాటు మెజారిటీ ఎంపీటీసీ, జడ్పీటీసీల్లో విజయం సాధించి సత్తా చాటారు.

స్థానికంలో కోటాపై బీసీల ఫైట్..

వచ్చే నెలలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం పూర్తి కాగా, తాజాగా మునిసిపల్ పాలక వర్గాల గడువు కూడా తీరింది. దీంతో స్థానిక సంస్థలు అన్ని కూడా ఇంచార్జ్ అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. దీంతో ప్రభుత్వం మార్చి నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో బీసీ కులాల నుంచి రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్ తెరపైకి వస్తోంది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీ కులగణన కూడా పూర్తి చేశారు. దీనికి సంబంధించిన వివరాలను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. బీసీ ఈ గ్రూపుతో కలిపి బీసీలు రాష్ట్రంలో 50శాతానికి పైగా ఉండటంతో 42శాతానికి పైగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌ను బీసీ సంఘాలు వినిపిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 36,46,955మంది జనాభా ఉండగా, ఇందులో

మిగతా 6వ పేజీలో...

బొడ్రాయి వార్షికోత్సవాన్ని సక్సెస్ చేయండి

- పట్టణ ప్రజలంతా పాల్గొనాలి
- ఎమ్మెల్యే మురళీనాయక్



బొడ్రాయి వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలో ఈనెల 12న జరుపతలపెట్టిన గ్రామదేవత బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవ కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ తేదీన జరిగే బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో కుల, మతతారతమ్యం లేకుండా ప్రతీ ఒక్కరు పాల్గొనాలని కోరారు. ప్రజలంతా ఐక్యమత్యంలో ఉత్సవాలను కన్నుల పండువగా జరుపుకోవాలన్నారు. బొడ్రాయి తల్లి సర్వ శ్రేష్ఠశుభప్రదం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు మదన్‌లోయా, ఎడ్ల రమేష్, పిల్లి సుధాకర్, ఆకుల హరిప్రసాద్, శంతన్ రామారాజు, గోనె శ్యామ్, పద్మం ప్రవీణ్, సిరిపురం వీరన్న, బంగాల నర్సింహారావు, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

సొళ్లతండాను సందర్శించిన జర్మన్ దేశస్థురాలు



సొళ్లతండాలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న జర్మన్ దేశస్థురాలు మౌనిక రాటరింగ్

నెల్లికుదురు, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సొళ్లతండాను జర్మన్ దేశస్థురాలు మౌనిక రాటరింగ్ శుక్రవారం సందర్శించారు. తండాలో రైతు బానోత్ విజయ్ సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని ఆమె పరిశీలించారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన జొన్న, మొక్కజొన్న, ఇతర పంటలను పరిశీలించారు. సాగులో అవలంబిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గోశాల షెడ్డు నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయనున్నట్లు తెలిపారు.



గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

16 మంది విద్యార్థులకు అస్వస్థత

గూడూరు మండలం దామరవంచ గురుకులంలో ఘటన

- రాత్రి భోజనం తర్వాత కడుపునొప్పి, వాంతులు
- తీవ్ర అస్వస్థతకు గురైన నలుగురిని గూడూరు ఆస్పత్రికి తరలింపు
- విద్యార్థులను పరామర్శించిన ప్రజాప్రతినిధులు

6

డీటీసీ పుప్పాల శ్రీనివాస్ ఇంట్లో ఏసీబీ సోదాలు

- ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు
- అద్దె ఇల్లు, ఆఫీసు, జగిత్యాల, హైదరాబాద్‌లో ఏకకాలంలో దాడులు
- పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న అధికారులు

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల నేపథ్యంలో రవాణా శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా ఉప కమిషనర్ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ నివాసంతో పాటు ఆయన బంధువుల ఇళ్లలో అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హనుమకొండలోని వలివేల్పుల రోడ్డులోని దుర్గాకాలనీలో నివాసం ఉండే కిరాయిఇంటితో పాటు భీమారంలోని ఆర్‌టీఏ కార్యాలయంలోని తన చాంబర్, హైద్రాబాద్‌లోని సొంత ఇళ్లు, స్వగ్రామమైన జగిత్యాల, కరీంనగర్‌లోని బంధువుల ఇళ్లలో ఉదయం 6 గంటల నుంచే సోదాలు నిర్వహించినట్లు వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. హైదరాబాద్‌లోని విల్లాలతో పాటు ప్లాట్స్, ఇతరత్రా పలు ఆస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నామని, అన్నింటినీ పరిశీలిస్తున్నామన్నారు. పరిశీలన తర్వాత ఏసీబీ డీజీపీ స్వయంగా వివరాలు వెల్లడిస్తారని పేర్కొన్నారు. కాగా, పుప్పాల శ్రీనివాస్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్‌గా, ఎంవీఐగా పనిచేసినట్లుగా రవాణాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే శ్రీనివాస్ ఉద్యోగ విరమణ ఉన్నట్లుగా తెలుస్తోంది. కాగా, డీటీసీ ఇంట్లో సోదాలతో రవాణా శాఖలోని ఇతర అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్‌టీఏ కార్యాయాల్లో ఎక్కడ చూసినా ఏసీబీ అధికారుల సోదాలపైనే అధికారులు, సిబ్బంది చర్చించుకోవడం కనిపించింది.



హనుమకొండలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు, వారితో డీటీసీ శ్రీనివాస్

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి : కలెక్టర్



కురవి ఆశ్రమ గురుకులంలో భోజనాన్ని పరిశీలిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

కురవి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పరిశుభ్రంగా అందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. కురవిలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టళ్లలోని డైనింగ్‌హాల్, తరగతి గదులు, పరిసరాలు, స్టోర్‌రూం, వంట గదులను స్వయంగా తనిఖీ చేశారు. ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా పిల్లలకు స్వచ్ఛమైన, రుచికరమైన భోజనం అందించాలని, వంటచేసే సిబ్బంది పరిశుభ్రంగా చేతులు కడుక్కుని ఆహార పదార్థాలను సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండిన వంటలను తిని పరిశీలించారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా అందేలా చూసుకోవాలని చెప్పారు. ప్రతీ సబ్జెక్టుపై విద్యార్థులకు ఎలాంటి సందేహాలు ఉన్నా ఉపాధ్యాయులు వాటిని నివృత్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపాళ్లు, వార్డెన్‌లు, ఆర్‌సీవో పాల్గొన్నారు.

10 నుంచి పలు రైళ్లు రద్దు

- వెల్లడించిన దక్షిణ మధ్య రైల్వే

డోర్నకల్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేదీ నుంచి పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. కాజీపేట-విజయవాడ సెక్షన్‌లోని ఖమ్మం స్టేషన్ వద్ద మూడోలైన్ నిర్మాణంలో భాగంగా జరుగుతున్న ట్రాక్ మరమ్మతుల కారణంగా వాటిని రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. రైలు నెంబర్ 67765 కాజీపేట-డోర్నకల్, 67766 డోర్నకల్-కాజీపేట, 67767 డోర్నకల్-విజయవాడ, 677768 విజయవాడ-డోర్నకల్ మధ్య నడుస్తున్న ప్యాసింజర్‌ను ఫిబ్రవరి 10వ తేదీ నుంచి 20 వరకు రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. 67215 విజయవాడ-భద్రాచలం రోడ్ ప్యాసింజర్, 67216 భద్రాచలం రోడ్-విజయవాడ ప్యాసింజర్, 17201/02 గుంటూరు-సికింద్రాబాద్, గుంటూరు-సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్, 17233 సికింద్రాబాద్ -సిరిపూర్‌కాగజ్‌నగర్‌లను 20వ తేదీ వరకు, 17234 సిరిపూర్‌కాగజ్‌నగర్-సికింద్రాబాద్‌ను 11వ తేదీ నుంచి 20 వరకు, 12705/06 గుంటూరు-సికింద్రాబాద్, సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను 10,11,15, 18, 19, 20 తేదీల్లో, 12713/14 విజయవాడ-సికింద్రాబాద్, సికింద్రాబాద్-విజయవాడ శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను 11, 14, 16, 18, 19, 20 తేదీల్లో, రద్దు చేస్తున్నట్లు తెలిపింది. 20833/34 విశాఖపట్టణం- సికింద్రాబాద్, సికింద్రాబాద్-విశాఖపట్టణం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 19, 20 తేదీల్లో 75 నిమిషాల పాటు ఆలస్యంగా ప్రారంభమవుతుంది. 17406 ఆదిలాబాద్-తిరుపతి కృష్ణ ఎక్స్‌ప్రెస్‌ను 9, 11, 14, 18, 19 తేదీల్లో 90 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరుతుందని పేర్కొంది. 18045/46 ఈస్ట్‌కోస్ ఎక్స్‌ప్రెస్‌ను 17, 19 తేదీల్లో పగిడిపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా దారి మళ్లించినట్లు తెలిపింది.

సాగునీరు విడుదల చేయాలి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



కర్క్యాల గ్రామశివారు పాలేరువాగు సమీపంలో రైతులతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలేరు వాగు పరివాహక ప్రాంత రైతులకు సాగునీటిని తక్షణమే విడుదల చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు శుక్రవారం కర్క్యాల గ్రామశివారులోని పాలేరు వాగును పరిశీలించి, రైతులతో మాట్లాడారు. గత ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనునిత్యం పాటుపడిందన్నారు. కాళేశ్వరం ద్వారా వేసవి కాలంలో సైతం సాగునీరు అందించిందని, రైతుల సౌకర్యార్థం చెక్‌డ్యామ్ నిర్మాణం చేస్తే ప్రస్తుతం నీరులేకవాగు ఎండిపోయిందన్నారు. డీపీఎం 60 కాలువ నుంచి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటి తరలించుకుపోతుండటే స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం ఆరోపించారు. ఎస్సారెస్పీ జలాలు విడుదలపై సీఈ, ఎస్ఈ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, నీటి విడుదల చేయాలని కోరారు. స్పందించిన అధికారులు రెండురోజుల్లో విడుదల చేస్తామని వెల్లడించారు. మండల పార్టీ అధ్యక్షుడు సీతా రాములు, ప్రమోద్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, పసులాది వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్-930పీ అలైన్‌మెంట్ మార్చాలి

సీఎం సలహాదారుడు వేం, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌కు రైతుల విజ్ఞప్తి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) : వలిగొండ నుంచి భద్రాచలం వరకు నిర్మించే జాతీయ రహదారి (ఎన్‌హెచ్)-930పీ అలైన్‌మెంట్‌ను మార్చాలని సాలార్‌తండా, రజాలిపేట, ఇల్లందు రోడ్ రైతులు విజ్ఞప్తి చేశారు. కేసముద్రం మండలం అర్పనపల్లిలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, గూడూరు మండలం మచ్చర్లలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్‌కు శుక్రవారం రైతులు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు నీరుటి లక్ష్మీనారాయణ, గుగులోతు రాము మాట్లాడారు. వలిగొండ నుంచి భద్రాచలం వరకు నిర్మించే ఎన్‌హెచ్-930పీ మహబూబాబాద్ పట్టణం మధ్యలో నుంచి పోవడంతో సాలార్‌తండాలో ఇళ్లు, రజాలిపేట, ఇల్లందురోడ్‌లో రైతులు భూములు కోల్పోతున్నారని చెప్పారు. ఎన్‌హెచ్-930పీ ప్రారంభంలో పట్టణానికి బయట నుంచి 5 కిలోమీటర్ల దూరం నుంచి అలైన్‌మెంట్ చేయగా, మధ్యలో కొంతమంది రాజకీయ పలుకుబడిని ఉపయోగించి అలైన్‌మెంట్‌ను

మిగతా 8వ పేజీలో...



కేసముద్రం మండలం అర్పనపల్లిలో వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న రజాలిపేట, సాలార్‌తండా, ఇల్లందురోడ్ రైతులు



మచ్చర్లలో జాటోతు హుస్సేన్‌నాయక్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న రజాలిపేట, సాలార్‌తండా, ఇల్లందు రోడ్ రైతులు

రైతు ఆత్మహత్యాయత్నం



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భూక్య గోపి

మహబూబాబాద్ రూరల్, (ఆంధ్రజ్యోతి) : వలిగొండ నుంచి భద్రాచలం వైపు వెళ్లే జాతీయ రహదారి 930పీ నిర్మాణంతో తన భూమి పోతుందని మనస్తాపానికి గురై మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు సాలార్‌తండాకు చెందిన రైతు భూక్య గోపి గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గత కొంతకాలంగా జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్చాలని సాలార్‌తండా రైతులు ఆందోళనలు చేస్తున్నారు. ఈనెల 5న జాతీయ రహదారి నిర్మాణం కోసం సాలార్‌తండా వద్ద అధికారులు సర్వే నిర్వహించేందుకు రాగా, రైతులతో పాటు గోపి అడ్డుకుని రాస్తారోకో చేపట్టారు. తాజాగా శుక్రవారం ఎన్‌హెచ్-930పీతో తనకున్న 20 గుంటల భూమి పోతుందని మనోవేదనకు గురై ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం గోపి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

16మంది విద్యార్థులకు అస్వస్థత

- మానుకోట జిల్లా దామరవంచ గురుకులంలో ఘటన
- రాత్రి భోజనం తర్వాత కడుపునొప్పి, వాంతులు
- తీవ్ర అస్వస్థతకు గురైన నలుగురిని గూడూరు ఆస్పత్రికి తరలింపు
- విద్యార్థులను పరామర్శించిన ప్రజాప్రతినిధులు



గూడూరు ఆస్పత్రిలో విద్యార్థిని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్





చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

గూడూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డైట్ చార్జీలు పెంచి.. గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మెనూ మార్చినప్పటికి పరిస్థితిలో మాత్రం మార్పురాలేదు. నాణ్యమైన, శుభ్రమైన భోజనం అందక మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 16 మంది విద్యార్థులు శుక్రవారం తెల్లవారుజామున అస్వస్థతకు గురయ్యారు. అందులో నలుగురు తీవ్రంగా, 12 మంది స్వల్ప అనారోగ్యానికి గురవగా.. వారిని గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాంతో తీవ్ర అస్వస్థతకు గురైన నలుగురు విద్యార్థులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గురువారం సాయంత్రం గురుకులంలోని సుమారు 530మంది విద్యార్థులకు స్నాక్స్ కింద గుడాలు.. రాత్రి భోజనంలో అన్నంతో పాటు కాకరకాయ కూర, సాంబారు వడ్డించారు. వారిలో 16 మంది విద్యార్థులకు అర్ధరాత్రి దాటాక కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు కావడంతో విషయం తెలుసుకున్న గురుకుల జూనియర్ సీనియర్ ప్రిన్సిపాల్ రమేష్, జూనియర్ ప్రిన్సిపల్ రాజమౌళి, వార్డెన్ అప్పారావు, ఏఎన్ఎం, ఉపాధ్యాయుల సహాయంతో తీవ్ర అస్వస్థతకు గురైన లాకావత్ రాహుల్, గుగులోతు సాయిప్రసాద్, బానోత్ యాకూబ్, బానోత్ అనిల్‌ను గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కలుషిత ఆహారం తినడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ వీరన్న వెల్లడించారు.

పరామర్శించిన ఎమ్మెల్యే, నేతలు

మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించారు. ఆయనే స్వయంగా స్టెతస్కోప్‌తో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. వైద్యాధికారులతో మాట్లాడి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు వారికి అందిస్తున్న వైద్యసేవలను తెలియజేయాలని సూచించారు. అలాగే మహబూబాబాద్ మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కూడా విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని గురుకులాలలో ఫుడ్‌పాయిజన్ పరంపర కొనసాగుతుందని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు గురుకులాల బాట పట్టినా వసతిగృహాల్లో ఎలాంటి మార్పురావడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో గురుకులాలు మృత్యుకుహరాలుగా మారాయని విమర్శించారు.

గురుకులాన్ని సందర్శించిన అధికారులు..

దామరవంచ గురుకులంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని తెలుసుకున్న మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో వీరస్వామి, తహసీల్దార్ శ్వేత, ఎంపీవో సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ కోమల, ఆర్ఐ మల్లయ్య వేర్వేరుగా గురుకులాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న నలుగురు విద్యార్థులను పరామర్శించారు. ఇక గురుకుల పాఠశాలలో అయోధ్యపురం పీహెచ్‌సీ వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, గురుకుల పరిసరాలను పరిశీలించారు. అయితే సదరు గురుకుల ప్రిన్సిపాల్ హేమంత్ సెలవులో ఉన్నారు.

మేడారంలో ముమ్మరంగా ఉచిత వైద్య సేవలు



మేడారంలో వైద్య శిబిరంలో సిబ్బంది

తాడ్వాయి, ఫిబ్రవరి 7, (ఆంధ్రజ్యోతి): మేడారం మినీ జాతరకు వచ్చే భక్తులకు వైద్య సేవలు అందించడానికి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసింది. డిప్యూటీ డీఎంహెచ్‌వో కోరం క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఏటూరునాగారం, కన్నాయిగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యులు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు శుక్రవారం వైద్య సేవలందించారు. జ్వర పీడితులకు, డైయోరియా, డీహైడ్రెషన్ తదితర రుగ్మతల పైఅవగాహన కల్పించారు. వైద్యంతోపాటు మందులు అందజేశారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

- హుండీ నగదు, వెండి సామగ్రి అపహరణ



హుండీలో నగదును అపహరిస్తున్న దుండగుడు

ములుగు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ములుగు సమీపంలోని ప్రేమ్‌నగర్ సాయిబాబా ఆలయంలో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి గురువారం అర్ధరాత్రి సమయంలో తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించాడు. హుండీలోని నగదుతోపాటు బీరువాలో ఉన్న వెండి పూజా సామగ్రిని అపహరించాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున గమనించిన అర్చకులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. ఇదే ఆలయంలో ఇంతకుముందు ఐదుసార్లు చోరీ జరిగినట్లు పూజారులు తెలిపారు.

ప్రజల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ములుగు నియోజకవర్గ నాయకురాలు కుంజ కుసుమాంజలి



కొత్తగూడలో కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుతున్న కుసుమాంజలి

కొత్తగూడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి సీతక్క కోడలు, ములుగు నియోజకవర్గ నాయకురాలు కుంజ కుసుమాంజలి తెలిపారు. ఓటాయి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు చెన్నూరి సోమయ్య, విజయ్, పోలే రాజు శుక్రవారం కొత్తగూడలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారి కి కాంగ్రెస్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆమె ఆహ్వానించారు. కోనాపురంలో ఇటీవల మృతి చెందిన వల్లపు చంద్రమ్మ కుటుంబసభ్యులను ఆమె పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, పార్టీ యూత్ అధ్యక్షుడు బోయినేని ప్రశాంత్‌రెడ్డి ఓటాయి గ్రామ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల సారంగపాణి, మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి నోముల ప్రశాంత్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

మహబూబాబాద్ డీఈవో రవీందర్‌రెడ్డి



మహబూబాబాద్ ప్రభుత్వ పాఠశాలలో స్టడీ అవర్స్‌ను పరిశీలిస్తున్న రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మార్చిలో జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాల సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మహబూబాబాద్ డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి శుక్రవారం ప్రధానోపాధ్యాయులు, ప్రోగ్రాం అధికారులు, ఎంఈవోలతో జూమ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెస్ట్ పరీక్షలకు హాజరైన ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్టడీ అవర్స్‌లో విద్యార్థులకు స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ, తక్కువ మార్కులు వచ్చే విద్యార్థులు నిరుత్సాహానికి లోనుకాకుండా వారిని ప్రోత్సహించే విధంగా తల్లిదండ్రులతో మాట్లాడి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీలలో విద్యార్థుల బేస్‌లైన్, మిడ్‌లైన్ ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం త్వరగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, మౌళిక వసతుల కల్పన, సౌకర్యం, చిన్న చిన్న మరమ్మతులు చేయడం, ప్రతిపాదనలు, క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ కోర్సు ప్రారంభం మొదలగు త్వరితగతిన చేపట్టాలన్నారు. జిల్లా స్థాయిలో రిసోర్స్ పర్సన్స్‌కి బాష ఉపాధ్యాయులకు తెలుగు, హిందీ, ఆంగ్లం శిక్షణ జరుగుతున్న సెంటర్లను సందర్శించారు. ఐఎఫ్‌పీ ద్వారా విద్యాబోధన చేస్తే ఫ్యూచర్ లెర్నర్స్ ఎక్కు వ ఆసక్తి చూపించి నేర్చుకుంటారని పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టడీ అవర్స్‌ను సందర్శించి విద్యార్థుల ప్రగతిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. డీఈవో వెంట కోర్సు కోఆర్డినేటర్ చంద్రశేఖర్, క్వాలిటీ కోఆర్డినేటర్ ఆజాద్‌చంద్రశేఖర్, డీఎస్వో అప్పారావు ఉన్నారు.

లక్నవరంలో శ్రీలంక వాసుల సందడి



లక్నవరం చెరువు వద్ద శ్రీలంక దేశస్థులు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని ప్రఖ్యాత లక్నవరం చెరువును శ్రీలంక వాసులు శుక్రవారం సందర్శించారు. 15 మందితో పర్యాటకులతో కూడిన బృందం సాయంత్రం చెరువు వద్దకు చేరుకొని బోటింగ్ చేశారు. తీగల వంతెనలపై నుంచి ప్రకృతిని ఆస్వాదించారు. చుట్టూ కొండల నడుమ చెరువు అందాలు అద్భుతంగా ఉన్నాయని కితాబిచ్చారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి

- అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో
- ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ల తనిఖీ
- అందుబాటులో లేని హాస్టల్ వార్డెన్
- ఆగ్రహం వ్యక్తం చేసిన అదనపు కలెక్టర్



కస్తూర్బాలో వంటగదిని పరిశీలించి మెనూను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

తొర్రూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తొర్రూరులోని ఇంటిగ్రేటెడ్, కేజీబీవీ హాస్టళ్లను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. స్థానికంగా ఉంటున్న అధికారులు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లను తనిఖీ చేయాలని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గురుకులాల్లో నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తుందని, ఉపాధ్యాయులు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కస్తూర్బా పాఠశాలలో కొన్నేళ్లుగా విద్యార్థులకు మెనూ ప్రకారం అల్పాహారం అందించడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు మెనూ ప్రకారమే అందించాలని ఆదేశించారు. ప్రతీ బుధవారం చికెన్, నెలకు రెండు రోజులు గులాబ్ జామ్ ఇవ్వాల్సి ఉండగా అందించడం లేదని, 150 మంది ఉన్న విద్యార్థులకు రోజుకు ప్రభుత్వ నిబంధనల మేరకు వంట సామాన్లు కూడా ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మునిసిపాలిటీలో రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. విద్యార్థులకు ఖచ్చితంగా మెనూ ప్రకారం ఆహారం అందజేయాల్సిందేనని ఆదేశించారు.ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వార్డెన్ రమేష్ అందుబాటులో లేకపోవడంతో సంబంధిత అధికారులకు సమాచారం అందించాల న్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గణేష్, మునిసిపల్ కమిషనర్ శాంతి కుమార్, మేనేజర్ కట్టస్వామి, ప్రిన్సిపాల్ శైలజ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇనుగుర్తి పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆరోగ్య శాఖ రాష్ట్ర డైరెక్టర్



ఇనుగుర్తి పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న రవీందర్‌నాయక్

ఇనుగుర్తి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.రవీందర్‌నాయక్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను, నిల్వ ఉన్న మందులను, వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. వైద్యం అందించడంలో వైద్యులు , సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రోగులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సందరంగా ఆయన్ను స్థానిక వైద్యసిబ్బంది శాలువాతో సత్కరించారు. జిల్లా వైద్యాధికారి జి.మురళీధర్, వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

● నెల్లికుదురు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నైనాలలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్ సాయంత్రం సందర్శించారు. రికార్డులు, మందులను, వైద్యసిబ్బంది పనితీరును పరిశీలించారు. మెరుగైన ఆరోగ్యసేవలు అందించాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో మురళీధర్, డాక్టర్ సుధీర్‌రెడ్డి, డాక్టర్ సారంగం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : షీ టీంఎం ఎస్సై

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలు, యాంటీ హ్యూమన్ ట్రాకింగ్‌పై విద్యార్థినులకు అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఎస్సై సునంద అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థినులకు ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం అధ్యక్షతన సైబర్ నేరాలు, యాంటీ హ్యూమన్ ట్రాకింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సునంద మాట్లాడుతూ...ఆకతాయిలు ఎవరైనా ఎక్కడైనా బాలికలను భయాందోళనకు గురిచేసిన, అసభ్యకరంగా ప్రవర్తించా వెంటనే షీ టీం వాట్సాప్ నెంబర్ : 8712656935కు సమాచారం అందించాలన్నారు. మహిళలు, విద్యార్థినులు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి బెదిరింపులకు భయపడవద్దని సూచించారు. విద్యార్థినులు తప్పని సరిగా ట్రావెల్ సేఫ్ యాప్‌ను ఉపయోగించుకొని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. వ్యక్తిగత, కుటుంబ సమాచారం కానీ సామాజిక మాధ్యమాల్లో పెట్టకూడదని, వ్యక్తిగత ఫోటోలు డీపీలు పెట్టుకోవద్దని సూచించారు. మొబైల్ యాప్‌లలో వచ్చిన అవసరమైన బ్లూ లింక్‌లను క్లిక్ చేయవద్దన్నారు. సైబర్ నేరాల బారిన పడినట్లయితే అధైర్యపడకుండా సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. మైనర్లు వాహనాలు నడపవద్దని పేర్కొన్నారు. ఈ సదస్సులో షీ టీం సిబ్బంది అరుణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికంలో బీసీల హవా!



(5వ పేజీ తరువాయి)

బీసీలు 14,28,043మంది ఉన్నట్లుగా గుర్తించారు. మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో అత్యధికంగా గిరిజనులున్నారు. అయినా ఉమ్మడి జిల్లాల్లో బీసీలు 40శాతానికి పైగా ఉన్నట్లు తేలింది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణనలో ఉమ్మడి జిల్లాలో బీసీల జనాభా మరింత పెరిగిందని, 45శాతానికి పైగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంఘాలు పట్టుబడుతున్నాయి. 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేవలం 22శాతం రిజర్వేషన్ కల్పించారు. అయినా అవకాశాన్ని బట్టి జనరల్ స్థానాల్లో పోటీ చేసి, 35 నుంచి 40శాతం వరకు బీసీలు ఎన్నికల్లో సత్తా చాటారు. రాజకీయ చైతన్యం ఉండటంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ డిమాండ్‌తోనే గత ఆదివారం వరంగల్ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో బీసీ ఐక్య జేఏసీ ఆధ్వర్యంలో బహిరంగ సభ కూడా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు చేసిన కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారు.

2019 ఎన్నికల్లో పెరిగిన బీసీల ప్రాతినిథ్యం

ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో బీసీలు రాజకీయంగా చైతన్యం అవుతున్నారు. 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం కేవలం 22శాతమే రిజర్వేషన్లు కల్పించింది. అయినప్పటికి జనరల్ స్థానాల్లో పోటీ చేసి బీసీలు సత్తా చాటారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,167 జీపీలకు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో బీసీలకు 212 సర్పంచ్ స్థానాలు రిజర్వుడు చేశారు. గిరిజనులు అత్యధికంగా ఉన్న మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో బీసీలకు 22శాతం కాకుండా, అక్కడ జనాబా ఆధారంగా సీట్లు దక్కాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో బీసీల సీట్లకు కోత పడింది. అయినా ఈ రిజర్వేషన్‌తో అవకాశం వచ్చిన సర్పంచ్ స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లో పోటీ చేసిన బీసీలు సర్పంచ్‌లుగా విజయం సాధించారు. మొత్తం 1,167 స్థానాల్లో 422 సీట్లలో బీసీలు సర్పంచ్‌లుగా విజయం సాధించారు. అదనంగా 200 జనరల్ స్థానాల్లో బీసీలు పాగా వేశారు. మొత్తంగా 25.5శాతం సీట్లు బీసీల పరమయ్యాయి. అలాగే ఎంపీటీసీ స్థానాల్లోనూ బీసీలు జనరల్ స్థానాల్లో పాగా వేశారు. మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 764 స్థానాలుండగా, బీసీలకు 114 ఎంపీటీసీ స్థానాలు రిజర్వు అయ్యాయి. వీటితో పాటు జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేసి అదనంగా మరో 163 స్థానాల్లో విజయం సాధించారు. మొత్తం 277స్థానాల్లో బీసీలు ఎంపీటీసీలుగా ఎంపికయ్యారు. తమకు కేటాయించిన స్థానాలకంటే రెండింతలు అధికంగా విజయం సాధించారు. మొత్తంగా 36.3శాతం సీట్లను బీసీలు కైవసం చేసుకుని రాజకీయంగా ఎంతో చైతన్యవంతులో చాటి చెప్పారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 70జడ్పీటీసీలు ఉండగా, 9జడ్పీటీసీలే బీసీలకు రిజర్వు అయ్యాయి. అయితే జనరల్ స్థానాల్లో పోటీ చేసి మరో 11స్థానాల్లో బీసీలు విజయం సాధించారు. మొత్తంగా 20మంది జడ్పీటీసీలు బీసీలు ఎన్నికయ్యారు. కోటకంటే అధనంగా 29శాతం మంది బీసీలు జడ్పీటీసీలుగా విజయం సాధించారు.

జనరల్ కోటాలో బీసీల పట్టు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీసీలు తమ కోటాకు మించి విజయం సాధించారు. గిరిజనులు అధికంగా ప్రాంతాల్లో అధిక సీట్లు గిరిజనులకే కేటాయించారు. దీంతో ఆ జిల్లాల్లో బీసీల జనాభా ఆధారంగా సీట్లు లభించాయి. మహబూబాబాద్ జిల్లాల్లో అత్యధికంగా గిరిజన జనాభే ఉంది. ఈ జిల్లాలో 16మంది జడ్పీటీసీ స్థానాలున్నాయి. అయితే ఈ జిల్లాలో అధికంగా ఎస్టీలు ఉండటంతో పాటు ఆరు మండలాల్లో పెసా చట్టం అమల్లో ఉంది. గిరిజన ప్రాబల్య ప్రాంతం కావటంతో 2019లో జరిగిన ఎన్నికల్లో మహబూబాబాద్ జిల్లాల్లో బీసీలకు ఒక్క జడ్పీటీసీ స్థానం కూడా రిజర్వేషన్ లేదు. అయినప్పటికి ఇక్కడ జనరల్ స్థానాల్లో పోటీ చేసి ఇద్దరు బీసీ అభ్యర్థులు జడ్పీటీసీలుగా విజయం సాధించారు. ఇదే జిల్లాలో ఎంపీటీసీల్లోనూ బీసీ అభ్యర్థులు జనరల్ స్థానాల్లో సత్తా చాటారు. మహబూబాబాద్ జిల్లాల్లో మొత్తం 198 ఎంపీటీసీ స్థానాలు ఉంటే కేవలం బీసీలకు ఐదు స్థానాలే రిజర్వేషన్ చేశారు. కానీ, అప్పటి ఎన్నికల్లో మరో 32ఎంపీటీసీ జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేసి విజయం దక్కించుకున్నారు. దాంతో మహబూబాబాద్ గిరిజన జిల్లాలో మొత్తం 37మంది బీసీలు ఎంపీటీసీలుగా విజయం సాధించారు. వరంగల్ జిల్లాలో 11జడ్పీటీసీ స్థానాలు ఉంటే బీసీలకు ఒకటే స్థానం రిజర్వుడు చేశారు. మరో నాలుగు జనరల్ స్థానాల్లో బీసీలు విజయం సాధించారు. ములుగు జిల్లాల్లో 150 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగితే బీసీలకు కేవలం ఆరు జీపీలే రిజర్వు అయ్యాయి. అయినప్పటికి జనరల్ స్థానాల్లోపోటీ చేసి 29మంది బీసీ సర్పంచ్‌లు విజయం సాధించారు. భూపాలపల్లి, హనుమకొండ, జనగామ జిల్లాల్లోనూ బీసీలు అధికంగా ఉన్నారు.

మహా ఘట్టానికి అంకురార్పణ

- తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు
- 42 ఏళ్ల తర్వాత ఘనంగా వేడుకలు

మహదేవపూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా ప్రఖ్యాతిగాంచిన కాళేశ్వరం ఆధ్యాత్మిక శోభితంగా మారింది. 42 ఏళ్ల తర్వాత జరుగుతున్న మహాకుంభాభిషేక వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో మూడు రోజుల పాటు ఈ మహాఘట్టం జరగనుండగా తొలిరోజైన శుక్రవారం వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చనాపురం వేద పండితుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. వేద పండితులు తెల్లవారుజామున మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, బాజాభజంత్రీల మధ్య కలశాలతో కాళేశ్వరాలయం నుంచి బయల్దేరి త్రివేణి సంగమం గోదావరికి చేరుకున్నారు. పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారి సన్నిధానికి చేరుకున్నారు. అనంతరం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మంగళవాయిద్యాలతో వేద స్వస్తి వాచకాలు, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వర్ణనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశనం, అఖండ జ్యోతి ప్రజ్వలన, యాగశాల ప్రవేశం, నవగ్రహ వాస్తు, యోగిని, క్షేత్ర పాలక, చతుర్లింగ భద్ర సర్వతో భద్ర మండప దేవతా స్థాపన పూజలు, హోమాలు, చండీపారాయణం నిర్వహించారు. మధ్యాహ్నం 3.30నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం, చండీ సప్తశతి పారాయణం, నవర్తన మూల మంత్ర జపాలు, సహస్ర ఘటస్థాపన పూజలు, ప్రదోషకాల పూజ, హారతి, మంత్ర పుష్పం, చతుర్వేద స్వస్తి పారాయణం, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

మంత్రోచ్చారణలతో మార్మోగిన ఆలయ పరిసరాలు

కాళేశ్వరాలయంలో 1982 కుంభాభిషేకం జరిగింది. 42 ఏళ్ల తర్వాత ఈ వేడుకలు వైభవంగా జరుగుతుండగా.. మంచిర్యాల జిల్లా అర్చనాపురం గ్రామానికి చెందిన మనోహర్‌శర్మ ఆధ్వర్యంలో 50 మంది వేద పండితులు, కాళేశ్వరాలయ అర్చకులతో మహా కుంభాభిషేకం ఘనంగా ప్రారంభమైంది. వేదపండితుల మంత్రోచ్చరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఎన్నో సంవత్సరాల తర్వాత ఇలాంటి కార్యక్రమం జరగడం ఆలయానికి, ఊరికి శుభసూచకమని భక్తులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాళేశ్వరంలో అంగరంగ వైభవంగా కుంభాభిషేకం



గోదావరి నుంచి కలశాల్లో జలాలు తీసుకొస్తున్న అర్చకులు, వేద పండితులు



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

పటిష్ఠ చర్యలు చేపట్టాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న మహాకుంభాభిషేక మహోత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్‌తో కలిసి ఆయన శుక్రవారం పర్యటించారు. 9న జరిగే మహా కుంభాభిషేక ముగింపు కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, రద్దీకి తగట్టు ఏర్పాట్లు చేయాలన్నారు. గోదావరి ఘాట్ వద్ద స్నాన ఘట్టాలను పరిశీలించిన కలెక్టర్ భక్తులు భారీ సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించనున్న దృష్ట్యా వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తుల వాహనాల గోదావరి ఘాట్ వద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక పార్కింగ్‌లోనే భక్తులు వాహనాలను తరలించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కుంభాభిషేకంలో పారిశుధ్య నిర్వహణకు 70 మంది కార్మికుల సేవలను వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. నాలుగు సెక్టార్లుగా విభజించి పారిశుధ్య నిర్వహణను చేపడుతున్నట్లు చెప్పారు. అత్యవసర సమయంలో భక్తులకు వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. వైద్యాధికారులు నిరంతర పర్యవేక్షించాలన్నారు. అత్యవసర వైద్య సేవలకు మహదేవ పూర్‌లోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో బెడ్లు కేటాయించినట్లు తెలిపారు. పోలీసులు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పటిష్ట బందోబస్తును నిర్వహించాల న్నారు. నిర్దేశిత ప్రాంతం దాటి భక్తులు గోదావరి లోకి వెళ్లకుండా నియంత్రించాలన్నారు. 9వ తేదీన ఆలయ ప్రధాన ద్వారం వద్దకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని, అందుకు తగిన బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీపీవో నారాయణరావు, మండల ప్రత్యేక అధికారి వీరభద్రయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, దేవస్థానం ఈవో మహేష్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

నేడు తుని పీఠాధిపతి రాక

కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాకుంభాషేకానికి ఆదిశంకరాచార్యుల ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తుని తపోవనానికి చెందిన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి హాజరుకానున్నారు. శనివారం జరిగే కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు.



వేద మంత్రాలతో క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

మహా కుంభాభిషేకానికి ముగ్గురు మంత్రుల రాక

రేపు జరిగే కార్యక్రమాలకు హాజరు



మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి కొండా సురేఖ



మంత్రి శ్రీధర్‌బాబు

మహదేవపూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరంలో జరుగుతున్న కుంభాభిషేకానికి ముగ్గురు మంత్రులు హాజరుకానున్నారు. మూడు రోజులపాటు ఈ వేడుక జరగుతుండగా చివరి రోజు ఆదివారం మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. మంత్రులతోపాటు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాజరుకానున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి ఉండగా మంత్రులు, ఎంపీ నిబంధనలకు కట్టుబడే ఈ వేడుకల్లో పాల్గొనన్నుట్లు తెలిపారు.

50 ఏళ్లకు కలుసుకున్నారు..

నిట్‌లో 1970- 75 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం

హనుమకొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్ 1970-75 సంవత్సరం స్వర్ణోత్సవ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిట్ క్యాంపస్‌లోని బోస్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ సమ్మేళనంలో 50 ఏళ్ల కిందట చదువుకున్న సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అలనాటి తమ కళాశాల మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. కళాశాలలో చదువు ముగించుకొని బయటకు వచ్చిన తర్వాత అయిదు దశాబ్దాల్లో తాము సాధించిన విజయాలను పరస్పరం పంచుకున్నారు. ఆ నాడు తాము చదువుకున్న తరగతి గదులను, క్యాంపస్‌లో తాము తిరిగిన ప్రదేశాలను మరోసారి సందర్శించారు. కళాశాల అభివృద్ధికి అమూల్యమైన సేవలు అందించిన ప్రముఖులు రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు, ప్రొఫెసర్ ఎస్. శిరీష్ డీన్ (సంశోధన, అభివృద్ధి) ప్రొఫెసర్ ఎ.వేణు వినోద్ (డీన్, ఫ్యాకల్టీ వెల్ఫేర్) వరంగల్ నిట్ అల్యూమినీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.రామ తదితరులను ఈ సందర్భంగా సత్కరించారు.



వరంగల్ నిట్‌లో జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 50ఏళ్ల నాటి స్నేహితులు

స్థానికంలో బీసీల హవా!

5వ పేజీ తరువాయి



బీసీలు 14,28,043మంది ఉన్నట్లుగా గుర్తించారు. మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో అత్యధికంగా గిరిజనులున్నారు. అయినా ఉమ్మడి జిల్లాల్లో బీసీలు 40శాతానికి పైగా ఉన్నట్టు తేలింది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కల గణనలో ఉమ్మడి జిల్లాలో బీసీల జనాభా మరింత పెరిగిందని, 45శాతానికి పైగా ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంఘాలు పట్టుబడుతున్నాయి. 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేవలం 22శాతం రిజర్వేషన్ కల్పించారు. అయినా అవకాశాన్ని బట్టి జనరల్ స్థానాల్లో పోటీ చేసి, 35 నుంచి 40శాతం వరకు బీసీలు ఎన్నికల్లో సత్తా చాటారు. రాజకీయ చైతన్యం ఉండటంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ డిమాండ్‌తోనే గత ఆదివారం వరంగల్ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో బీసీ ఐక్య జేఏసీ ఆధ్వర్యంలో బహిరంగ సభ కూడా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు చేసిన కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారు.

2019 ఎన్నికల్లో పెరిగిన బీసీల ప్రాతినిధ్యం

ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో బీసీలు రాజకీయంగా చైతన్యం అవుతున్నారు. 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం కేవలం 22శాతమే రిజర్వేషన్లు కల్పించింది. అయినప్పటికీ జనరల్ స్థానాల్లో పోటీ చేసి బీసీలు సత్తా చాటారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,167 జీపీలకు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో బీసీలకు 212 సర్పంచ్ స్థానాలు రిజర్వుడు చేశారు. గిరిజనులు అత్యధికంగా ఉన్న మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో బీసీలకు 22శాతం కాకుండా, అక్కడ జనాభా అధారంగా సీట్లు దక్కాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో బీసీల సీట్లకు కోత పడింది. అయినా ఈ రిజర్వేషన్‌తో అవకాశం వచ్చిన సర్పంచ్ స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లో పోటీ చేసిన బీసీలు సర్పంచ్‌లుగా విజయం సాధించారు. మొత్తం 1,167 స్థానాల్లో 422 సీట్లలో బీసీలు సర్పంచ్‌లుగా విజయం సాధించారు. అదనంగా 200 జనరల్ స్థానాల్లో బీసీలు పాగా వేశారు. మొత్తంగా 25.5శాతం సీట్లు బీసీల పరమయ్యాయి. అలాగే ఎంపీటీసీ స్థానాల్లోనూ బీసీలు జనరల్ స్థానాల్లో పాగా వేశారు. మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 764 స్థానాలుండగా, బీసీలకు 114 ఎంపీటీసీ స్థానాలు రిజర్వు అయ్యాయి. వీటితో పాటు జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేసి అదనంగా మరో 163 స్థానాల్లో విజయం సాధించారు. మొత్తం 277స్థానాల్లో బీసీలు ఎంపీటీసీలుగా ఎంపికయ్యారు. తమకు కేటాయించిన స్థానాలకంటే రెండింతలు అధికంగా విజయం సాధించారు. మొత్తంగా 36.3శాతం సీట్లను బీసీలు కైవసం చేసుకుని రాజకీయంగా ఎంతో చైతన్యవంతులో చాటి చెప్పారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 70జడ్పీటీసీలు ఉండగా, 9జడ్పీటీసీలే బీసీలకు రిజర్వు అయ్యాయి. అయితే జనరల్ స్థానాల్లో పోటీ చేసి మరో 11స్థానాల్లో బీసీలు విజయం సాధించారు. మొత్తంగా 20మంది జడ్పీటీసీలు బీసీలు ఎన్నికయ్యారు. కోటకంటే అధనంగా 29శాతం మంది బీసీలు జడ్పీటీసీలుగా విజయం సాధించారు.

జనరల్ కోటాలో బీసీల పట్టు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీసీలు తమ కోటాకు మించి విజయం సాధించారు. గిరిజనులు అధికంగా ప్రాంతాల్లో అధిక సీట్లు గిరిజనులకే కేటాయించారు. దీంతో ఆ జిల్లాల్లో బీసీల జనాభా ఆధారంగా సీట్లు లభించాయి. మహబూబాబాద్ జిల్లాల్లో అత్యధికంగా గిరిజన జనాబే ఉంది. ఈ జిల్లాలో 16మంది జడ్పీటీసీ స్థానాలున్నాయి. అయితే ఈ జిల్లాలో అధికంగా ఎస్టీలు ఉండటంతో పాటు ఆరు మండలాల్లో పెసా చట్టం అమల్లో ఉంది. గిరిజన ప్రాబల్య ప్రాంతం కావటంతో 2019లో జరిగిన ఎన్నికల్లో మహబూబాబాద్ జిల్లాల్లో బీసీలకు ఒక్క జడ్పీటీసీ స్థానం కూడా రిజర్వేషన్ లేదు. అయినప్పటికి ఇక్కడ జనరల్ స్థానాల్లో పోటీ చేసి ఇద్దరు బీసీ అభ్యర్థులు జడ్పీటీసీలుగా విజయం సాధించారు. ఇదే జిల్లాలో ఎంపీటీసీల్లోనూ బీసీ అభ్యర్థులు జనరల్ స్థానాల్లో సత్తా చాటారు. మహబూబాబాద్ జిల్లాల్లో మొత్తం 198 ఎంపీటీసీ స్థానాలు ఉంటే కేవలం బీసీలకు ఐదు స్థానాలే రిజర్వేషన్ చేశారు. కానీ, అప్పటి ఎన్నికల్లో మరో 32ఎంపీటీసీ జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేసి విజయం దక్కించుకున్నారు. దాంతో మహబూబాబాద్ గిరిజన జిల్లాలో మొత్తం 37మంది బీసీలు ఎంపీటీసీలుగా విజయం సాధించారు.

వరంగల్ జిల్లాలో 11జడ్పీటీసీ స్థానాలు ఉంటే బీసీలకు ఒకటే స్థానం రిజర్వుడు చేశారు. మరో నాలుగు జనరల్ స్థానాల్లో బీసీలు విజయం సాధించారు. ములుగు జిల్లాల్లో 150 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగితే బీసీలకు కేవలం ఆరు జీపీలే రిజర్వు అయ్యాయి. అయినప్పటికి జనరల్ స్థానాల్లోపోటీ చేసి 29మంది బీసీ సర్పంచ్‌లు విజయం సాధించారు. భూపాలపల్లి, హనుమకొండ, జనగామ జిల్లాల్లోనూ బీసీలు అధికంగా ఉన్నారు.

2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బీసీల ప్రాతినిధ్యం ఇలా

	వరంగల్	హనుమకొండ	జనగామ	మానుకోట	భూపాలపల్లి	ములుగు
గ్రామ పంచాయతీలు	325	210	281	461	240	150
బీసీ రిజర్వుడు	48	46	39	22	51	06
మొత్తం బీసీలు నెగ్గినవి	63	68	95	67	100	29
మొత్తం ఎంపీటీసీలు	134	130	128	198	102	72
బీసీ రిజర్వుడు	35	30	17	5	23	25
మొత్తం బీసీలు నెగ్గినవి	53	63	55	37	43	26
మొత్తం జడ్పీటీసీలు	11	12	12	16	11	08
బీసీ రిజర్వుడు	01	03	01	00	02	02
మొత్తం బీసీలు నెగ్గినవి	05	05	01	02	04	03

సంగీతంలో ఓలలాడిన కళాక్షేత్రం


- ఘనంగా విద్యారణ్య సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవం
- వేడుకలు ప్రారంభించి కీర్తనలు ఆలపించిన కలెక్టర్ ప్రావీణ్య
- సంగీతం, నృత్య మేళవింపుతో హోరెత్తిన కాళోజీ ఆడిటోరియం

నేత్ర పర్వం



భద్రకాళి శేషును సత్కరిస్తున్న కలెక్టర్, కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం నగరంలోని సంగీత ప్రియులతో ఓలలాడింది. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన వేడుకల పరంపర. రాత్రి 9గంటల వరకు కొనసాగుతూనే ఉంది. కళాకారులు, కళాభిమానులతో ఆడిటోరియం కిక్కిరిసింది. వరంగల్‌లోని విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య లాంచనంగా జ్యోతి వెలిగించి స్వర్ణోత్సవ వేడుకలను ప్రారంభించారు. అనంతరం సంగీత ప్రపంచంలో ప్రముఖులైన వారి పంచరత్న కీర్తనల గోష్టి గానంలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పాల్గొనడమే గాక.. గాయనీ గాయకులతో కలిసి 'దుడుకు గల నన్నే దొర కొడుతూ..' అనే కీర్తనతో శృతి కలిపి అద్భుతంగా ఆలపించారు. ఆమె రెండు గంటల పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



స్వర్ణోత్సవ వేడుకలు ప్రారంభిస్తున్న కలెక్టర్ పి. ప్రావీణ్య

స్వర్ణోత్సవాల వేళ సద్గురు త్యాగరాజ ఆరాధనోత్సవాలు, పండిట్ నారాయణ్ బాత్కండే, పండిట్ విష్ణు దిగంబర్ పలుస్కర్ ఉత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా పంచరత్న కీర్తలను ఆలపించిన ప్రముఖులలో జిల్లా కలెక్టర్‌తోపాటు ఆచార్య తిరుపతయ్య, హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రముఖ విద్వాంసుడు వాసా గోపీనాథ్, భద్రకాళిశేషు, సింగారపు భాస్కర్, వొద్దిరాజు నివేదిత, సుహిత, ఉమ్మడి లక్ష్మణాచార్య, లాయక్, జియాహుద్దీన్, చిన్న, కుంట రాజు, పద్మజ తదితర అనేక మంది గాయకులు సంగీత కళాశాల కర్ణాటక గాత్ర ప్రస్తుత, పూర్వ విద్యార్థులు పాల్గొని సంకీర్తనలను ఆలపించారు. ఈ సందర్భంగా విద్యారణ్య సంగీత కళాశాల విద్యార్థులు ప్రభుత్వ గురుకులాల్లో ఉద్యోగాలు సంపాదించుకున్న సుహిత, శివలీల, నవ్య తదితర 8మందిని సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల పరంపరలో భాగంగా నగరంలోని ప్రముఖ నాట్యాచార్యులు బొంపెల్లి సుధీర్‌కుమార్, తాడూరి రేణుక, వెంపటి శ్రావణి, రుూస్సీ, జయశ్రీ, పరమేశ్వర్, రుద్రవేణు, చైతన్య తదితరుల శిష్య బృందంతో ఒకదానివెంట ఒకటి సంప్రదాయ కూచిపూడి, భరత నాట్యాలను అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించారు. ఈ సందర్భంగా సంగీత కళాశాల పేరిణి నాట్యాచారులు గజ్జెల రంజిత్, సవ్యజ శిష్య బృందంచే అద్భుత పేరిణి నృత్య ప్రదర్శన కూడా నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు సితార్ విద్వాంసులు జక్కు సత్యనారాయణ, హిందుస్థానీ గాత్ర విద్వాంసురాలు అనుమలు యోషు, మృదంగ విద్వాంసులు ఏడిద భీంశంకర్, వయోలిన్ విద్వాంసులు చిన్ని కృష్ణ, కర్ణాటక గాత్ర విద్వాంసులు ఎస్.భాస్కర్ శిష్య బృందం కూడా ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చారు.

కళాకారులు అభినందనీయులు

కళలకు కాణాచి అయిన ఓరుగల్లు నగరంలో విద్యారణ్య ప్రభుత్వ సంగీత కళాశాల కళాకారుల పాలిట గొప్ప వరమని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కొనియాడారు. కళాశాలలో చదువుకున్న విద్యార్థులందరినీ అభినందించారు. రాష్ట్ర స్థాయిలో పేరుగడించిన ఈ కళాశాల విద్యార్థులెందరో జాతీయ స్థాయిలోనూ గొప్ప కళాకారులుగా పేరు గడించడం హర్షించదగ్గ విషయమన్నారు.

ఎంతో భాగ్యం

ఎందరెందరో ఉద్దండులైన విద్వాంసుల ఆధ్వర్యంలో 52 వసంతాలు పూర్తి చేసుకున్న ఓరుగల్లు విద్యారణ్య సంగీత కళాశాలకు స్వర్ణోత్సవ వేళ తాను ప్రిన్సిపాల్‌గా ఉండడం ఎంతో భాగ్యమని ఈ కార్యక్రమాలను రూపొందించిన ప్రిన్సిపాల్ ఎస్.సుధీర్‌కుమార్ అన్నారు. తమ కళాశాలకు అన్ని వసతులు సమకూర్చితే మరింతగా కళాకారులను అన్ని రంగాల్లో తీర్చి దిద్దుతామన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ , మున్సిపల్ కమిషనర్, సాంస్కృతిక శాఖ సంచాలకుల సంపూర్ణ సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓని విజయ్‌తోపాటు నగరంలోని సంగీత, సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

అనుమతి లేని ఆస్పత్రులపై చర్యలు

• డీఎంహెచ్‌వో మురళీధర్ రావు

తొర్రూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి జి.మురళీధర్‌రావు అన్నారు. శుక్రవారం తొర్రూరులోని బాలాజీ నర్సింగ్ హోమ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండురోజుల క్రితం ఆస్పత్రిలో సిద్దార్థ (16) అనే విద్యార్థికి వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటించి మృతి చెందాడనే బంధువుల ఆరోపణ మేరకు తనిఖీ చేశామన్నారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ వివరాలు, నర్సింగ్ స్టాఫ్, రిజిస్టర్‌లు అందుతున్న వైద్య సేవలు, వసతులు తదితర అంశాలు అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు అనుమతులు తీసుకున్న డాక్టర్‌లే ఆస్పత్రులను నిర్వహించాలని, ఇతర వ్యక్తులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పట్టణంలో అనుమతులు లేకుండా స్కానింగ్ సెంటర్‌లలో పరీక్షలు చేసి లింగ నిర్ధారణ చేస్తున్నారని, వారిపై చర్యలుంటాయన్నారు. సిద్దార్థ మృతిపై పోస్టుమార్టం రిపోర్టు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆస్పత్రిపై చర్యలుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు సుధీర్ రెడ్డి, వనాకర్‌రెడ్డి, ప్రసాద్, వైద్యులు మీరజ్, జ్వలిత ఉన్నారు.

కేసముద్రం మార్కెట్లో డిజిటల్ సర్వే

• అభివృద్ధి పనుల కోసం టోపో గ్రాఫికల్ సర్వే
• అంగుళం సహా భౌగోళిక వివరాల నమోదు
• ఉమ్మడి జిల్లాలో కొన్ని మార్కెట్లలో సర్వే పూర్తి




కేసముద్రం మార్కెట్లో సర్వే కోసం అమర్చిన డీజీపీఎస్ పరికరం, సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

కేసముద్రం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం డిజిటల్ సర్వే నిర్వహించారు. మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అత్యాధునిక పరికరాలతో మార్కెట్లో 'టోపోగ్రాఫికల్ సర్వే'ను ప్రారంభించారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని మహబూబాబాద్, నర్సంపేట, నెక్కొండ, ఎనుమాముల, తరిగొప్పుల మార్కెట్లలో సర్వే పూర్తి చేసినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. మార్కెట్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడానికైనా టోపోగ్రాఫికల్ సర్వే నివేదిక తప్పనిసరిగా ఉండాలనే నిబంధనలను ప్రభుత్వం విధించింది. దీంతో అన్ని మార్కెట్లలో ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈసర్వేలో భాగంగా మార్కెట్ పాత కార్యాలయం ఎదురుగా ఖాళీ స్థలాన్ని కేంద్రంగా డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (డీజీపీఎస్) యంత్రాన్ని ఏర్పాటు చేశారు. మరో డీజీపీఎస్ యంత్రాన్ని పట్టుకొని సర్వే సిబ్బంది మార్కెట్‌లోని అన్ని స్థలాలను సర్వే నిర్వహించారు. సర్వే సిబ్బందికి మార్కెట్ ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు వివిధ స్థలాలను చూపించారు. ఈ సర్వే ద్వారా మార్కెట్లో ప్రతీ అంగుళంలో ఎలాంటి నిర్మాణం ఉందనే విషయాన్ని నమోదు చేస్తామని సర్వే నిర్వాహకులు తెలిపారు.

టోపోగ్రాఫికల్ సర్వే ఎందుకంటే..?

మార్కెట్‌కు సంబంధించిన విస్తీర్ణం, మౌలిక సదుపాయాల వివరాలతో కూడిన సర్వే నివేదికలు ఇప్పటికే ఉన్నాయి. అయితే ఇందులో కేవలం వైశాల్యం మినహా ఇతర వివరాలు అందుబాటులో ఉండవు. అత్యాధునిక సాంకేతిక పరికరాలతో నిర్వహించే ఈ టోపోగ్రాఫికల్ సర్వేలో మార్కెట్లో ప్రతీ చదరపు సెంటీమీటరులో వివరాలు నమోదు చేయబడుతాయి. ఒక నిర్దిష్ట స్థలాన్ని కేంద్రంగా చేసుకొని డీజీపీఎస్ యంత్రాన్ని అమర్చి మరో యంత్రంతో వివరాలను నమోదు చేస్తారు. సర్వేలో అంగుళం స్థలంలో సైతం భూభాగం ఉపరితల లక్షణాలు, ఆ ప్రదేశంలోని సహజ, మానవ నిర్మిత అంశాలతో సహా వివరణాత్మకంగా అధ్యయనం చేసి మ్యాప్ రూపొందిస్తారు. భూభాగంలోనిఎత్తు, ఆకృతి, భౌతిక లక్షణాలను ఖచ్చితమైన సమాచారాన్ని సేకరిస్తారు.అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తూ స్పష్టమైన వివరాలు ఉండడంతోనే ఈ టోపోగ్రాఫికల్ సర్వేను అభివృద్ధి పనుల్లో మార్కెటింగ్ శాఖ తప్పనిసరి చేసింది. ఈ సర్వేతో అభివృద్ధి పనులు మరింత మెరుగ్గా చేపట్టే వీలుంటుంది.

ఎన్‌హెచ్-930పీ అలైన్‌మెంట్ మార్చాలి

(5వ పేజీ తరువాయి)

మార్చారని ఆరోపించారు. ఈ క్రమంలో సాలార్‌తండా వద్ద గిరిజన రైతులు తమ ఇళ్లు, భూములను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి అలైన్‌మెంట్‌ను మార్చి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, రైతులు బాలాజీ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సాలార్‌తండా వద్ద మహిళా రైతుల దీక్ష.

జాతీయ రహదారి-930పీ అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ సాలార్‌తండా వద్ద గిరిజన మహిళా రైతులు దీక్ష చేపట్టారు. ఇళ్ల మధ్యలో నుంచి వెళ్తున్న జాతీయ రహదారి అలైన్‌మెంట్‌ను మార్చాలని అనేకమార్లు ప్రభుత్వపెద్దలకు, అధికారులకు మొర పెట్టుకున్నామని తమ సమస్యను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి నిర్మాణంతో తమఇళ్లు కోల్పోతే నిలువనీడలేకుండాపోతుందని వాపోయారు. పట్టణానికి దూరంగా జాతీయ రహదారి నిర్మిస్తే అందరికి ఆమోదయోగ్యంగా ఉంటుందని చెప్పారు. మహిళా రైతులు బాదావత్ లక్ష్మి, రాణి, క్రాంతి, విజయ, సుహాసిని పాల్గొన్నారు.



సాలార్‌తండాలో నిరాహార దీక్ష చేస్తున్న మహిళా రైతులు

ఆటోను ఢీకొట్టిన లారీ

• ముగ్గురికి గాయాలు

మరిపెడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆటోను లారీ ఢీకొట్టడంతో ముగ్గురు గాయపడిన సంఘటన శుక్రవారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై బోలగాని సతీశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం మేడిదపల్లికి చెందిన కొమ్మనబోయిన దేవయ్య, చంద్రమ్మతో పాటు వీరి మనమరాలు బంక సమంత ఆటోలో మరిపెడబంగ్లా వస్తున్నారు. తొర్రూరు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఆ ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలోని ముగ్గురికి గాయాలయ్యాయి. సమంత ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను హైదరాబాద్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైరస్ సోకి 50 నాటుకోళ్లు మృతి

• కొత్తగూడ మండల కేంద్రంలో ఘటన

కొత్తగూడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడలో నాటుకోళ్లకు వింత వైరస్ సోకి శుక్రవారం 50 నాటుకోళ్లు మృతిచెందాయి. బాధితుడు రాజబోయిన రాజు తెలిపిన వివరాల ప్రకారం. కొత్తగూడ గ్రామానికి చెందిన రాజబోయిన రాజు నాటుకోళ్ల పెంపకమే వ్యాపారంగా చేస్తు జీవనం సాగిస్తున్నాడు. కోళ్లకు వింతవైరస్ సోకడంతో నాటు కోళ్లు మృతి చెందుతుండగా, నివారణకు మందులు వాడుతున్నాడు. కాగా, శుక్ర వారం ఒకేరోజు 50 నాటుకోళ్లు మృతి చెందాయి. మృతి చెందిన కోళ్లను చూసి రాజు రోధించారు. నాటుకోళ్ల పెంపకమే జీవనాధారంగా ఉంటున్నామని, కోళ్లు మృతి చెందడంతో సుమారు రూ. 70 వేల నష్టం జరిగిందని బాధితుడు వాపోయారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పలు కాలనీల్లో శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరవరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆర్తి గార్డెన్, వ్యవసాయ మార్కెట్, మునిసిపాలిటీ, ఫారెస్టు సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, హస్తీనాపురం, గోపాలపురం, నందనగార్డెన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్నేహనగర్, రాంచంద్రాపురం కాలనీ, గుండ్లకుంట కాలనీ, ఏటిగడ్డతండ, ఆకుల లక్ష్మయ్య కాలనీతో పాటు పలు కాలనీల్లో సబ్‌స్టేషన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరవరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మానుకోటలో ఎండు గంజాయి స్వాధీనం

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం శివారు డబుల్ బెడ్‌రూం కాలనీ సమీపంలో 120 గ్రాముల ఎండు గంజాయి, 274 గ్రాముల గంజాయి ద్రావణాన్ని పట్టుకున్నట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శుక్రవారం రాత్రి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. డబుల్‌బెడ్‌రూం కాలనీకి చెందిన ఎస్‌కె.జానీ, గిరిప్రసాద్‌నగర్‌కు చెందిన నల్ల వరుణ్‌లు కలిసి చెరొక కారును కొనుగోలు వాటిని నడుపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇటీవల సరిగ్గా కార్లకు కిరాయిలు రాకపోవడంతో కారు కొనుగోలు కోసం తీసుకువచ్చిన లోను ఈఎంఐ కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతురని చెప్పారు. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలని ఆశతో నెలరోజుల క్రితం జానీ ఆరుకు వెళ్లి అక్కడ ఒక కేజీ ఎండు గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్న క్రమంలో నల్ల వరుణ్ పరిచమయ్యాడు. ఎవరికైన గంజాయి కావాలంటే తమ దగ్గర ఉందని చెప్పాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇరువురు కలిసి డబుల్‌బెడ్‌రూం వద్ద గంజాయి ఎలా విక్రయించాలని చర్చించుకుంటున్న క్రమంలో పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో ఇరువురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 120 గ్రాముల ఎండు గంజాయి, 274 గ్రాముల గంజాయి ద్రావణం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాటి విలువ సుమారు రూ.140 లక్షల వరకు ఉంటుందని చెప్పారు.



షాపు యాజమానికి జరిమానా విధించి, స్లిప్‌ను అందజేస్తున్న మానుకోట మునిసిపల్ సిబ్బంది

ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే చర్యలు తప్పవు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే చర్యలు తప్పవని మునిసిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ కరుణాకర్ హెచ్చరించారు. మహబూబాబాద్ పట్టణంలో మునిసిపల్ కమిషనర్ రవీందర్ ఆదేశాలతో పలు షాపుల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. 60 కేజీల ప్లాస్టిక్ కవర్లను పట్టుకుని సీజ్ చేశారు. కవర్లను విక్రయిస్తు దుకాణాదారులకు రూ.8వేలు జరిమానాలు విధించారు ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్‌పెక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకంతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందని అందుకోసం ప్లాస్టిక్ కవర్లను వాడకుండా గోనె సంచులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ క్రాంతి, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

గురుకులాన్ని సందర్శించిన తక్కెళ్లపల్లి

గూడూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : దామరవంచ గిరిజన బాలుర ఆశ్రమ గురుకుల పాఠశాలను శుక్రవారం ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు సందర్శించారు. గురుకుల పాఠశాలలో కూరగాయలు, వంటగదిని, స్టోర్ రూంను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా అందుతుందని అడిగితెలుసుకున్నారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరుచుగా గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్నేని వెంకన్న, ఎడ్ల వేణు, రామన్ననాయక్, దేవేంద్రాచారి పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించడంలో విఫలం'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు ఆరోపించారు. మహబూబాబాద్‌లోని సీతారామయ్య ఏచూరి నగర్ ప్రాగణంలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా 4వ మహాసభలు జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లకు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళికవసతులు కల్పించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు దామెర కిషోర్, పట్ల మధు, సూర్యప్రకాష్, జ్యోతిబసు, సింహాద్రి, పవన్, మౌలానా, మహేష్, వినోద్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఉద్యోగాల పేరిట రూ.5.90 లక్షలు మాయం

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు హన్మంతరావు నగర్‌కు చెందిన ఓ వ్యక్తికి ఆన్‌లైన్ జాబ్ పేరిట ఆశచూపి రూ.5.90 లక్షలను కాజేసినట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శుక్రవారం రాత్రి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. హన్మంతరావునగర్‌కు చెందిన ఓ వ్యక్తికి ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు వాట్సాప్‌లో ఆన్‌లైన్‌లో జాబ్స్ కల్పిస్తామని లింకు పంపించారు. ఇది తెలియని సదరు వ్యక్తి లింకుపై క్లిక్ చేయడంతో పలు దఫాలుగా అతని అకౌంట్‌లో నుంచి రూ.5.90 లక్షలు మయమైనట్లు చెప్పారు. ఇది గుర్తించిన బాధితుడు మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గాయపడిన వ్యక్తి.. చికిత్స పొందుతూ మృతి

కొత్తగూడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కార్లాయి గ్రామానికి చెందిన కొట్టం కుమారస్వామి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొట్టం రామయ్య-దూడమ్మ దంపతుల కుమారుడు కొట్టం కుమారస్వామి (45) 15రోజుల క్రితం వరంగల్ జిల్లా చెన్నారావుపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కుమారస్వామి గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య స్వరూప, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

కారు, బైక్ ఢీ : ఒకరి మృతి

డోర్నకల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : కారు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓవ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై గడ్డం ఉమ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పాపటపల్లికి చెందిన వడ్డె వేణు (38) డోర్నకల్ నుంచి ద్విచక్రవాహనంపై తన సొంతూరు పాపటపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో డోర్నకల్ వైష్ణవి మిల్క్‌ప్లాంట్ సమీపంలో ఖమ్మం వైపు నుంచి గార్ల వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో వేణుకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్సనిమిత్తం ప్రైవేట్ వాహనం ద్వారా డోర్నకల్ ప్రాథమిక, ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ్నుంచి కుటుంబసభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వేణు శుక్రవారం మృతి చెందాడు. మృతుడు వేణుకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి సోదరుడు వడ్డె రామనర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరు రిమాండ్..

భార్యపై డిజీల్‌పోసి నిప్పంటించేందుకు యత్నించిన ఘటనలో పెరుమాండ్ల సంకీసకు చెందిన నీరుడు మహేష్‌పై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఉమ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు..

డోర్నకల్ మునిసిపల్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న దారావత్ సాయినాయక్ అనే వ్యక్తిపై తేజావత్ రమేష్ గురువారం దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో సాయికి గాయాలు కావడంతో అతన్ని ఆస్పత్రికి తరలించారు. బాధితుడు సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమ తెలిపారు.

భర్తపై వరకట్న వేధింపుల కేసు

మరిపెడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం భార్యను వేదిస్తున్న భర్తపై శుక్రవారం వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు మరిపెడ ఎస్సై సతీశ్ తెలిపారు. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం. మరిపెడ మండలంలోని పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన వంగూరి నాగలక్ష్మికి కొడకండ్ల మండలం నర్సింగాపురం గ్రామానికి చెందిన మట్టి హరీశ్‌తో పెద్దల సమక్షంలో రూ.15లక్షల కట్నకానుకలు ఇచ్చి వివాహం జరిపించారు. పెళ్లియైన కొద్ది రోజులు వీరి కాపురం సజావుగా సాగినప్పటికీ తల్లిదండ్రులు, ఆడబిడ్డల మాటలు విని హరీశ్ భార్యను అదనపు కట్నం కోసం వేదిస్తున్నారు. నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రకృతి సేద్యం ఉత్పత్తులకు అధిక డిమాండ్

జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

కేసముద్రం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి, సేంద్రీయ విధానంలో సాగు చేసిన పంట ఉత్పత్తులకు మార్కెట్లో అధిక డిమాండ్ ఉందని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల అన్నారు. కల్వలలో శుక్రవారం గంట దామోదర్‌రెడ్డి ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న వివిధ రకాల పంటలను డీఏవో పరిశీలించారు. తాను దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన 22 రకాల పసుపు, వివిధ రకాల పప్పుదినుసుల సాగును కొన్నేళ్లుగా చేస్తున్నట్లు రైతు దామోదర్‌రెడ్డి వివరించారు. భూమిలోంచి వెలికితీసిన పసుపును గోనెసంచుల్లో కట్టి ఉడికించడంవల్ల నాణ్యత, కర్‌క్యూమిన్ శాతం దెబ్బతినదని రైతు తెలిపారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయంతో భూమి, గాలి, నీరు కాలుష్యం జరగదని, ఈ ఉత్పత్తులకు ప్రత్యేక డిమాండ్‌తో మార్కెటింగ్ ఉంటుందని తెలిపారు. మహబూబాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకుడు అజ్మీరా శ్రీనివాస్‌నాయక్, ఎంఏవో బి.వెంకన్న, రాజు, మోహన్, ఏఈవోలు పాల్గొన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు



ఉర్సు ఉత్సవాల్లో ఛాదర్‌ను సమర్పిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్-ఉమ దంపతులు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మండలం వేంనూరు గ్రామంలో నూతన అజరత్ సయ్యద్ ఆలీమీరాతర్ దర్గా హజరత్ సయ్యద్ సైదుల్ బాబాఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్-ఉమ దంపతులు శుక్రవారం ఛాదర్ కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్ రెడ్డి, మతపెద్దలు పాల్గొన్నారు.

తీగలవేణి పీహెచ్‌సీ తనిఖీ

గూడూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : తీగలవేణి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో ప్రమీలరావు తనిఖీ నిర్వహించారు. లేబర్‌రూం, ఐఎల్ఆర్ రూములను పరిశీలించారు. జాతీయ కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలు జరిగే విధంగా చూడాలన్నారు. వైద్యాధికారి రాంబాబు, హెచ్ఈ గీత పాల్గొన్నారు.



రామాలయంలో పూజలు చేస్తున్న ఆలయ నూతన కమిటీ బాధ్యులు

రామాలయం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

మరిపెడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ బంగ్లాలోని రామాలయ నూతన కమిటీ బాధ్యులు శుక్రవారం ఆ ఆలయ సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేశారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ్‌రెడ్డి ఆలయ శాశ్వత చైర్మన్‌గా ఉన్న ఈ టెంపుల్‌కు వైస్ చైర్మన్‌గా నూకల అభినవ్‌రెడ్డి, ఆలయ ఇన్‌చార్జ్‌గా గంట్ల రంగారెడ్డి, కార్యదర్శి, కోశాధికారిగా వల్లి శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా ఉప్పల నాగేశ్వర్‌రావు, వెంపటి వెంకటేశ్వర్లు, బోనగిరి సత్యనారాయణ, కృష్ణమూర్తి, మచ్చ వెంకటనర్సు, బోడా రూప్లా, నర్సింహారెడ్డి, తల్లాడ మురళి, కొంపెల్లి వేణు, బాబుగౌడ్, గూడూరు నాగేశ్వర్‌రావు, వల్లి విద్యారాణి, దిలీప్ ప్రమాణస్వీకారం చేశారు.

'తీన్మార్ మల్లన్నపై కేసు నమోదు చేయాలి'

మరిపెడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై కేసు నవెదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మరిపెడ రెడ్డి సంక్షేమ సంఘ బాధ్యులు శుక్రవారం ఎస్సై సతీశ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు అశోక్‌రెడ్డి, నర్సిరెడ్డి స్థానిక విలేకరులతో మాట్లాడారు. తీన్మార్ మల్లన్న రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వాఖ్యలు చేసి కించపరిచే విధంగా మాట్లాడారన్నారు. ఒక హోదాలో ఉండి ఇతరుల మనోభావాలను కించపరిచినందున తీన్మార్ మల్లన్నపై క్రిమినల్ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. వారివెంట చామల సీతారాంరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పెద్దవంగర మండలంలో ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

పెద్దవంగర, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) : పెద్దవంగర మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఫర్టిలైజర్ షాపులను శుక్రవారం మరిపెడ ఏడీఏ విజయ్‌చందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి మాట్లాడుతూ అనుమతి లేని విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవో స్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి'

చిన్నగూడూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఉగ్గంపల్లి ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం, సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని గ్రామ ఉద్యోగ ఆత్మీయ సమ్మేళనం నిర్వాహకులు డీఎస్.జగన్, డీఎస్.వెంకన్న, శంకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 8, 9 తేదీలలో ఉగ్గంపల్లి శివారు మంచ్యానాయక్ తండాలో క్రీడా సాంస్కృతిక, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మండల, జిల్లాలోని ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి : ఎన్పీఆర్డీ

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్‌లో కేంద్రప్రభుత్వం వాటా నెలకు రూ.300 నుంచి రూ.5 వేల పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పీఆర్డీ) ఆధ్వర్యంలో జరుపతలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వర్రె బాలకృష్ణ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్లు ఎంపికలో ప్రాధాన్యత నివ్వడంతో పాటు బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో ఆర్.గౌరమ్మ, వి.సుధాకర్, సీహెచ్.నరేష్, ఆర్.సారయ్య, సరిత, మనెమ్మ, పద్మ, వెంకన్న పాల్గొన్నారు.

మస్జిద్ నూతన కమిటీ ఎన్నిక

డోర్నకల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మస్జిదే ఉస్మానియా కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండి.సలీమ్‌పాష, ఉపాధ్యక్షుడిగా ఎండి.ముస్తాక్, జనరల్ సెక్రటరీగా ఎండి.సర్వర్, జాయింట్ సెక్రటరీగా సమీరుల్లా, ట్రెజరర్‌గా షేక్.అబ్దుల్, వైస్ ట్రెజరర్‌గా యూసుఫ్‌పాషా, సభ్యులుగా ఎస్‌కె.ఖాదర్‌బాబా, ఎస్‌కె.గౌస్, ఎండి.అజీమ్, సయ్యద్ అహ్మతుల్లా, ఎండి.రఫీలు ఎన్నికయ్యారు.

రోగులకు వైద్యం అందించాలి

గార్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గ్రామాల్లో టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించి సరైన సమయంలో వైద్యసేవలు అందించి వ్యాధి నిర్మూలకు కృషి చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ శివకుమార్ అన్నారు. శుక్రవారం ముల్కనూరు పీహెచ్‌సీ ఆసుపత్రి వైద్యసిబ్బంది టీబీ వ్యాధి నిర్మూలపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి, మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా సిబ్బంది పని చేయాలన్నారు. సిబ్బంది బుజ్జమ్మ, ఇస్మాయిల్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి స్రవంతి

'నులి పురుగుల నివారణకు కృషి చేయాలి'

కురవి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల ఎదుగుదలకు అడ్డంకిగా నిలిచే నులి పురుగుల నివారణకు సంబంధిత అధికారులు కృషి చేయాలని బలపాల వైద్యాధికారి స్రవంతి అన్నారు. బలపాల పీహెచ్‌సీలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 0-19 వయస్సులోపు ఉన్న చిన్నారులందరికి ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేయాలని సూచించారు. డోర్నకల్ సీడీపీవో లక్ష్మి, డాక్టర్ యశస్విని, డాక్టర్ కరుణాకర్, సీహెచ్‌వో భద్రమ్మ, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, హెచ్ఈవో స్వామి, శోభ, ఏసుమని, జయశ్రీ పాల్గొన్నారు.

శివకుమార్‌కు ఖాన్ బహదూర్ అజిజాహ్లిక్ ట్రోఫీ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ ఫింగర్ ప్రింట్ యూనిట్ ఎస్సై శివకుమార్ కేంద్రస్థాయిలో ప్రతిష్ఠాత్మక ఖాన్ బహదూర్ అజిజాహ్లిక్ ట్రోఫీని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ చేతుల మీదుగా అందుకున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో న్యూఢిల్లీ ఆధ్వర్యంలో సీఏఫ్‌పీబీ జనవరి 30, 31 తేదీల్లో నిర్వహించిన 25వ అఖిల భారత ఫింగర్‌ప్రింటర్ బ్యూరో నిర్దేశకుల సమావేశం జరిగింది. సెంట్రల్ ఫింగర్‌ప్రింట్ బ్యూరో రాష్ట్రంలోని ఫింగర్ ప్రింట్ బ్యూరోలో నియామకులైన పోలీసువారు నిర్వహించే ఆలిండియా బోర్డు పరీక్షలలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎస్సై శివకుమార్ ప్రథమస్థానంలో నిలిచి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఆలిండియా బోర్డు పరీక్షలో మొదటిస్థానంలో నిలిచినందుకు నేర పరిశోధన విభాగం డీజీపీ శిఖాగోయల్, రాష్ట్ర ఫింగర్ ప్రింట్ బ్యూరో డైరెక్టర్ఎండి.తాతారావు, జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఎస్సై శివకుమార్‌ను అభినందించారు.



కేంద్రమంత్రి నిత్యానందరాయ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్సై శివకుమార్